# అపరిష్కృత సమస్యలపై ఆదివాసుల ఆందోళన




**దీర్ఘకాలికంగా** ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న తమ సమస్యలపై వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ **రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) పార్వతీపురం మన్యం జిల్లా కమిటి** ఆధ్వర్యంలో **పార్వతీపురంలో 4-7-22న** ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. స్థానిక సంఘ కార్యాలయం నుండి ఐటిడిఏ వరకు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన గిరిజన ప్రజానీకం సంఘం జెండాలు చేబూని, నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు. గిరిజనాభివృద్ధి కోసం ఏర్పరిచామని ప్రభుత్వాలు చెప్పుకునే ఐటిడిఏ కార్యాలయ ఆవరణలోకే గిరిజనులను రానీయకుండా పోలీసులు దాదాపు గంటపాటు నిరోధించారు. గిరిజనులు దీనిని నిరసిస్తూ తీవ్రంగా ప్రశ్నించటం, అధికారులతో వాగ్వివాదం తర్వాత లోనికి అనుమతించారు. సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో పి.ఓ. లేకపోవటాన్ని నిరసిస్తూ గిరిజనులు అక్కడే బైఠాయించటంతో, క్యాంపు ఆఫీసు నుండి పిఓ వచ్చి సంఘం అందించిన మెమోరాండం తీసుకున్నారు.

రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఏ కార్యాలయాన్ని అలంకారప్రాయం చేయబూనుకోవటాన్ని ఖండించారు. సీతంపేట ఐటిడిఏ పరిధిలో 240 గ్రామాలు, పార్వతీపురం ఐటిడిఏ పరిధిలో 170 గ్రామాలు గిరిజన గ్రామాలనీ, వీటిని వెంటనే షెడ్యూలు గ్రామాలుగా ప్రకటించాలన్నారు. పోడు భూములకు పట్టాలు చూపించకుంటే స్వాధీనం చేసుకుంటామని ఫారెస్టు అధికార్లు బెదిరించటాన్ని అరికట్టాలన్నారు. 20 గిరిజన గ్రామాలను కలిపే కూనేరు – ఎర్రబంద రహదారి నిర్మించాలని, రోడ్లు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజన్సీ గ్రామాల్లోని గెడ్డలపై, వాగులపై సమగ్ర సర్వే జరిపి మినీ రిజర్వాయర్లు నిర్మించి భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పి. శ్రీనునాయుడు మాట్లాడుతూ వానాకాలంలో ప్రబలే మలేరియా, టైఫాయిడ్‌ల వంటి అంటు రోగాల బారినపడి ప్రతి ఏటా ఎంతోమంది ఆదివాసులు మరణిస్తున్నారని, గిరిజన గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఊయక ముత్యాలు, మోనంగి భాస్కరరావు, కద్రక వెంకటస్వామి, చిన్నప్ప తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. గిరిజనులు తమ సాంప్రదాయ నృత్యాలు చేస్తూ, జనం పాటల ద్వారా తమ సమస్యల సత్వర పరిష్కారాన్ని డిమాండ్ చేశారు.

*****